క్లుప్తంగా

ఎన్టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్

–16 ద్విచక్రవాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం సీఐ ఏవీ రమణ తన సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవపత్రాలను లేని 16 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ, తరచూ పట్టణంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమాన వ్యక్తులు సంచారం, అసాంఘిక కార్యక్రమాల గురించి తమకు సమాచారమివ్వాలని స్థానికులను కోరారు. ఎస్సైలు ఏడుగొండలు, గోపి, పోలీసులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ సురేష్

గూడూరు రూరల్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు ర్యాబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేశారు. పాడి రైతులు, పెంపుడు కుక్కల యజమానులకు జూనోటిక్ వ్యాధులపై ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ అవగాహన కల్పించారు. 45 కుక్కలు, 3 పిల్లులకు టీకాలు వేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ మూగజీవాలపై ప్రేమ కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, పెంపుడు జంతువుల యజమానులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు



వైద్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న గూడూరు ఎమ్మెల్యే

చిల్లకూరు: గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఆదివారం తమ సభ్యులకు వాకర్స్ అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. వాకర్లకు బీపీ, మధుమేహం, కిడ్నీ తదితర వైద్య పరీక్షలను కేవీ హాస్పిటల్ వైద్యులు చేశారు. తొలుత శిబిరాన్ని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. వైద్యులకు జ్ఞాపికలు అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

పీర్ల నిమజ్జనం



గ్రామంలో ఊరేగుతున్న గుమ్మటం

చిట్టమూరు: మండలంలోని ఆరూరులో వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు ఆదివారం పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. మూడు అగ్నిగుండ ప్రవేశాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం గుమ్మటాన్ని పలు రకాల పుష్పాలతో అలంకరించి గ్రామంల్లో పీర్లను ఊరేగించారు. మేళతాళాల హోరు నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. చెరువు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పీర్లను నిమజ్జనం చేశారు. ప్రతి ఏటా హిందువులు, ముస్లింలు కలసి మొహర్రం వేడుకలు నిర్వహిస్తూ మతసామరస్యాన్ని ఇక్కడ చాటుతున్నారు.

దుస్తులు, పౌష్టికాహారం పంపిణీ



ఆస్పత్రిలో దుస్తులు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్: గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డెలివరీ వార్డులో తల్లి, పిల్లలకు లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్ క్లబ్ ఆదివారం గోరంట్ల రాంబాబు, సుజిత దాతృత్వంతో దుస్తులు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్వీ రావు, సెక్రటరీ మురళీకృష్ణ, ట్రెజరర్ గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సైదాపురంలో పందుల బెడద



సంచరిస్తున్న పందులు

సైదాపురం: సైదాపురం పంచాయతీలో కొన్ని రోజులుగా పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా పందుల సంచారం తీవ్రం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటి కట్టడికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పర్యావరణంపై

ప్లాస్టిక్ పంజా

ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని నాశనం చేస్తోంది. నియోజకవర్గంలో ప్లాస్టిక్ నిషేధం సక్రమం అమలు కావడం లేదు. ఫలితంగా ప్లాస్టిక్ సంచుల అమ్మకం, వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, పెళ్లకూరు, ఓజిలి మండాలాల్లో క్యారీబాగులు, డిస్పోజల్ గ్లాసులు, పేట్లు అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. గతంలో కొన్ని నెలల పాటు ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేయడంతో ప్రజలు అల్లిక బుట్టలు, పేపర్, జూట్‌బ్యాగుల వినియోగం వైపు మొగ్గు చూపారు. అయితే ప్రత్యేక తనిఖీల పేరుతో అధికారులు కొద్ది రోజులు తూతూ మంత్రంగా దాడులు జరిపి పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ భూతం మళ్లీ పంజా విసురుతోంది. మండలాల్లో ఎక్కడ చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. - ఓజిలి

క్రికెట్ విజేత కొన్నెంబట్టు



విజేతగా నిలిచిన కొన్నెంబట్టు జట్టు

సూళ్లూరుపేట: మండలంలోని ఇలుపూరు పంచాయతీ కొన్నెంబట్టులో మూడు నెలల నుంచి నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేతగా కొన్నెంబట్టు జట్టు నిలిచింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్స్‌లో సురేష్ లెవెన్స్‌పై ఈ జట్టు విజయం సాధించింది. మూడు నెలల కాలంలో 40 జట్లు ఈ టోర్నీలో తలపడ్డాయని ఆర్గనైజర్ తేరే సూర్య మల్లి క్రాంతి చెప్పారు. విన్నర్స్, రన్నర్స్ జట్లకు శంకు సురేష్ బహుమతులు అందజేశారు.

పాము కాటుకు రైతు మృతి

నాయుడుపేటటౌన్: పాముకు కాటుకు గురై రైతు మరణించిన విషాద సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని పుదూరులో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శంకరయ్య (48) ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని తమ పొలాల వద్దకు వెళ్లి గడ్డి కోసుకువచ్చాడు. గడ్డి కోస్తున్నప్పుడు కాలివద్ద ఏదో కరిచినట్లు గుర్తించాడు. ఆ తర్వాత గడ్డి తీసుకుని ఇంటికి వెళ్లేసరికి కళ్లు బైర్లు కమ్మాయి. ఇది గమనించి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపంలోని గ్రామానికి తీసుకువెళ్లారు. అప్పటికే శంకరయ్య పరిస్థితి విషమించి మరణించాడు. పాముకు గురై మరణించినట్టు గుర్తించారు.

కుప్పకూలి మృతి

పుదూరుకు అయ్యప్ప (50) ఆదివారం సాయంత్రం గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద ఉండగా ఉన్నఫళాన కుప్పకూలిపోయాడు. అతనిని స్థానిక వైద్యశాలకు తరలించిగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భక్తిప్రపత్తులతో ఏకాదశి పూజలు

నాయుడుపేటటౌన్: తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం స్థానిక బ్రాహ్మణవీధిలోని వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు నవ కలశారాధన, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, హోమ పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ కనుల పండువగా నిర్వహించారు. అలాగే కృష్ణ మందిరం, పలు శివాలయాల్లో తొలి ఏకాదశి పూజలు చేశారు.

కలవకొండలో..

చిల్లకూరు: శనయన ఏకాదశి సందర్భంగా మండలంలో కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామితో పాటు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవమూర్తులను మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆసనంపై కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఏకాంతసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ ఈఓ రవికృష్ణ పర్యవేక్షించారు.



చిల్లకూరు: ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

నాయుడుపేటటౌన్: అంటరానితనం, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ అని వైఎస్సార్ సీపీ నాయకులతోపాటు పలు సంఘాల నేతలు ఘన నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేర్వేరుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో రక్షణ శాఖ, వ్యవసాయ శాఖ, సామాజిక ప్రచార శాఖ మంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసి వినూత్న పథకాలను ప్రవేశపెట్టిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందని సంజీవయ్య కీర్తించారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సంజీవయ్య, జిల్లా నాయకులు

తీరంలో పర్యాటకుల సందడి



వాకాడు : మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో ఆదివారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పర్యాటకులతో తీరం సందడిగా మారింది. తిరుపతి జిల్లాతో పాటు నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి పర్యాటకులు ప్రతి సెలవు దినాన సముద్ర విహారం చేయడం సరదాగా మారింది. ఆదివారం తొలి ఏకాదశ పర్వదినం కావడంతో పర్యాటకులతో పాటు భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో సముద్రానికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 2 వేల మంది పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించినట్లు తెలుస్తోంది. అలాగే సముద్ర తీరంలోని సవక తోటల్లో వన భోజనాలు చేశారు.

భక్తిప్రపత్తులతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతమాచరిస్తున్న దంపతులు

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని సమాఖ్య అధ్యక్షులు ఆనిమెళ్ల శివకుమార్ దంపతులు, నెల్లూరుకు చెందిన ప్రముఖ అధ్యాత్మికవేత్త, ఉపన్యాసకులు శిరోమణి శర్మ దంపతులు నిర్వహించిన ఈ వ్రతంలో 50 మంది దంపతులు వ్రత పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు కడివేటి రామ్మూర్తి, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి విద్యాలలిత, సభ్యులు డీబీ శ్రీనివాస్, వేపకొమ్మ నరసింహారావు, పురుషోత్తం రావు, విశ్వనాధ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

గూడూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గూడూరులో ఏఐటీయూసీ, ఏఎఫ్‌టీయూ నాయకులు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్, టవర్‌క్లాక్ సెంటర్, రాజావీధి, గాంధీబొమ్మ, ఆర్టీసీ డిపో మీదుగా ఈ ర్యాలీ సాగింది. బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. ఐఎఫ్‌టీయు జిల్లా గౌరవాధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సీవీఆర్ కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, సునీల్, రిజ్వాన్, దీపు, యాకోబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో మోటార్ సైకిళ్ల ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: ఈనెల 9న కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సూళ్లూరుపేట ఏఐటీయూసీ నాయకులు ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మోటార్‌సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, నాగేంద్రబాబు మాట్లాడారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

● రథోత్సవం



గూడూరు పట్టణం కటరాజవీధిలోని పాండురంగస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. రుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేసిన అనంతరం రథంపై కొలువుదీర్చి, మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగించారు. రథోత్సవంలో కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. - చిల్లకూరు

భక్తి శ్రద్ధలతో 'మొహర్రం'

నాయుడుపేటటౌన్: మొహర్రం పండుగ వేడుకలను ఆదివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చిన్నపీర్ల చావడి, గరిడి వీధిలోని మౌలాలీ తాలామ్ ఖానా, మాలయకోట వద్ద ఉన్న పీర్ల వద్ద భక్తులు ఫాతెహా నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు పంజాలను పీర్ల వద్ద ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించారు. హిందూ–ముస్లింలు ప్రార్థనలు చేసి మత సామరస్యతను చాటారు. పీర్ల చావడి వద్ద అన్నదానం చేశారు. మాలయ కోటలో పీర్లు ప్రతిష్ఠించిన ప్రాంతం వద్ద శనివారం అర్ధ రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం ఆదివారం తెల్లవారుజాము వరకు గ్రామంలో పీర్లను ఊరేగించారు.



వాకాడు: చావిడిలో నిలిచిన పీర్లు



మాలయకోటలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

వాకాడులో..

వాకాడు: స్థానిక పీర్ల చావిడి వద్ద ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు చావిడిలో పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక యువకులు పీర్లను మేళతాళాల నడుమ ఊరేగించారు. మూడు రోజులుగా నియమనిష్ఠలతో ఉపవాసాలు ఉన్న భక్తులు రాత్రి అగ్నిగుండ ప్రవేశం చేశారు. చావిడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నోటీస్ బోర్డు

రేపు వెంకటగిరికి నేదురుమల్లి రాక

● **సైదాపురం:** వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం వెంకటగిరికి రానున్నారు. ఆయన తన నివాసంలో ఉదయం నుంచి కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు మండల సమావేశం

● **సైదాపురం:** మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన నిర్వహిచనున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ రవీంద్రబాబు తెలిపారు. సమావేశానికి సభ్యులు, మండల స్థాయి అధికారులందరూ పాల్గొనాలని కోరారు.

కండలేరులో 31.895 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 31.895 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2200, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

దుర్గ మృతిపై డీఎస్పీ విచారణ



పెళ్లకూరులో విచారణ చేస్తున్న డీఎస్పీ చెంచుబాబు

పెళ్లకూరు: మండలంలోని తూర్పుకండ్రిగకు చెందిన అమాన దుర్గ(27) మృతి ఉదంతంపై ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పునబాక విచారణ చేశారు. దుర్గ మృతికి కారణాలు, పోలీస్‌స్టేషన్ వద్ద దళితనాయకుడు యాగాని బెన్నీపై జరిగిన దాడి తదితర అంశాలపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక ఎస్సై నాగరాజు ఉన్నారు.

ఆలయంలో చోరీ యత్నం

కోట: గూడలికొండ మీద ఉన్న భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు చోరీకి యత్నించారు. ఆలయ ముఖద్వారం తలుపులు పగలగొట్టి ఉండడంతో ఉదయం అర్చకులు గుర్తించి దేవదాయశాఖ ఈఓ శశాంక్‌కు సమాచారం ఇచ్చారు.ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులతో ఆధారాలు సేకరించారు. ఆలయంలో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

సైదాపురం: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటన సైదాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. సైదాపురం దళితవాడకు చెందిన ఆమూరు మురళి (28) ఓ కుటుంబ విషయమై వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన మురళి పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకోవడంతో అతడిని కుటుంబ సభ్యులు శనివారం నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మురళి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు సైదాపురం పోలీసులకు సమాచారం చేరవేశారు. మురళి మృతిపై సమగ్ర విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న 'దుర్యోధన వధ'



శ్రీకాళహస్తి: చెన్నై రోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన, దుశ్శాసన వధ ఘట్టాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అలాగే మట్టితో తయారు చేసిన దుర్యోధన, దుశ్శాసన మట్టిబొమ్మలపై భీమ వేషధారి తన అభినయంతో ఆకట్టుకున్నారు. వధ ఘట్టం అనంతరం ఆలయం ఎదుట అగ్నిగుండంలో భక్తులు తాము తెచ్చిన కట్టెలను వేసి మొక్కులు చెల్లించారు. అగ్నిగుండం చుట్టూ మహిళలు పొంగళ్లు పెట్టి, కోళ్లను కోసి, అగ్నిగుండానికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.